క్లుప్తంగా

అర్హులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలి



విద్యుత్‌శాఖ అధికారులకు సమస్యలను తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులకు అప్పజెప్పిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం రాత్రి మడకశిర పర్యటనకు వచ్చిన విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఈఈలను కలిసి మడకశిర నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. సీనియార్టీ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేయాలన్నారు. ఆయనతో పాటు రైతు సంఘం ప్రతినిధులు దశనాథరెడ్డి, రంగధామరెడ్డి, అక్కంపల్లి నాగభూషణ్, గుడ్డంపల్లి దేవరాజు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి మందులు అందజేత

లేపాక్షి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన నరసింహమూర్తి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ బాధితుడి ఇంటికి వెళ్లి రూ. 42 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు.

వాహనాల తనిఖీ

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ రాజకుళ్లాయప్ప సిబ్బందితో కలసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశారు.

మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ వెంకట్రామప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, చాగలేరు మాజీ సర్పంచ్ శ్యానిగానిపల్లికి చెందిన వెంకట్రామప్ప (85) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి వెంకట్రామప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ బందేపల్లి శంకర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, సుబ్బిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలి



మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర: విధి నిర్వహణలో ఉద్యోగులు మంచి పేరు తెచ్చుకోవాలని మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి అన్నారు. మడకశిర డిపోలో పని చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్ రిజ్వానుల్లా శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జోనల్, రీజనల్ కార్యదర్శులు చెన్నారెడ్డి ,షబ్బీర్, డిపో ఎన్ఎంయూ నాయకులు సుబ్బరాయుడు, జయసింహ,లక్ష్మీకాంత్,రామకృష్ణ, ముద్దప్ప, ఈయూ అధ్యక్షుడు రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయంగా మిగిలిపోతుందని ఎంఈఓ గంగప్ప అన్నారు. మండల పరిధిలోని ఎస్ రాయాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరియప్ప పదవీ విరమణ కార్యక్రమం స్థానిక మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కరియప్ప, శివమ్మ దంపతులను సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో ప్రాణ ప్రతిష్ట



అలంకరణలో కెంచమాంబదేవి

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరులో వెలసిన కెంచమాంబదేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి నూతన విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. అలాగే ధ్వజారోహణ, గణపతి హోమం, మృత్యుంజయ హోమం, శాంతి, వాస్తు, మహా దుర్గ హోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఇదిలా ఉండగా శనివారం ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అప్పుల 'సాగు'



పరిగి పరిధిలో సాగైన వరి పంట



పి నరసాపురం పొలాల్లో వరి నాట్లలో బిజీగా మహిళా కూలీలు

దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై ప్రకృతి కన్నెర్రజేసినా.. పాలకులు పట్టించుకోకపోయినా మళ్లీ గంపెడాశలతో వారు పంట సాగుకు ఆసక్తి చూపడం సాధారణమైపోయింది. వాతావరణ పరిస్థితులతో ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు.. ప్రస్తుతం కోటి ఆశలతో రబీపై దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం అండగా నిలబడకపోయినా అప్పులు చేసి మరీ పంటలు వేస్తున్నారు.

- ఖరీఫ్‌లో రైతులకు భారీ నష్టాలు
- అయినా రబీ సాగుకు సిద్ధమైన కర్షకులు
- పీకల్లోతు కష్టాల్లోనూ వరినాట్లపై ఆసక్తి
- నేటికీ రైతులకు అందని ప్రభుత్వ సాయం

పరిగి: పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల పరిధిలో ఇటీవలి కాలంలో వరి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. గత ఖరీఫ్ సీజన్ కంటే రబీలో మరింతగా రైతులు వరినాట్లు వేస్తున్నారు. అన్ని మండలాల్లో రైతులు వరినాట్లపై ఆసక్తిని పెంచుకుని సాగు చేయడంతో బీడు భూములు పచ్చగా మారుతున్నాయి. ప్రధాన చెరువులు, బోరుబావుల క్రింద వరి సాగు ఎక్కువగా జరుగుతోంది. దీంతో పాటూ నదీ పరివాహక గ్రామాల పరిధిలోని ఫిల్టర్ బోర్లను వేయించి, పంటలను సాగు చేస్తున్నారు. దశాబ్దాలుగా సాగుకు నోచుకోని భూముల్లో నేడు వరి నాట్లతో కళకళలాడుతున్నాయి. పెనుకొండ నియోజకవర్గంలోనే రబీ సీజన్‌లో దాదాపు 2,300 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అలాగే మడకశిర నియోజకవర్గంలో 1200, హిందూపురం నియోజకవర్గంలో 600 ఎకరాల్లో వరి పంట సాగైనట్లు అంచనా వేస్తున్నారు. గతంతో పోల్చి చూస్తే యేటా వరిపంట సాగు శాతం బాగా పెరుగుతోందని రైతులతో పాటూ అధికార వర్గాలు తెలిపాయి. ఎకరాలో వరి పంట సాగుకు దాదాపుగా రూ.30 వేలు వరకూ ఖర్చవుతుందని రైతులు తెలిపారు.

గతమెంతో ఘనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యేటా రైతులకు రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 పెట్టుబడి సాయంగా అందించింది. దీంతో పాటూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది. రైతన్నలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి నాణ్యమైన లాభసాటి వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించి ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించింది. గిట్టుబాటు ధర కల్పించి, వ్యవసాయ ఉత్పత్తులను స్వయంగా అమ్ముకునేందుకు మార్కెట్ సదుపాయాన్ని కల్పించింది.

రైతన్న కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా నేటికీ ఒక్క నయాపైసా సాయం అందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామని నమ్మించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు తన మాట నిలబెట్టుకోలేకపోయాడని పెదవి విరుస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కొన్నిచోట్ల వర్షాలు, మరికొన్ని చోట్ల అధిక వర్షాలతో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. అరకొరగా పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోయారు.

ప్రస్తుతం వరిసాగు ఇలా...

నియోజకవర్గం	సాగైన వరి (ఎకరాల్లో..)
పెనుకొండ	2,300
మడకశిర	1200
హిందూపురం	600

అప్పులు చేసి మరీ...

ఓ వైపు పంట సాగు పెట్టుబడికి ప్రభుత్వ సాయం అందక, మరోవైపు పంటలు చేతికందక అన్నదాతలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే చాలా మంది అప్పులు చేసి మరి రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్నారు.

అప్పు చేసి పంట సాగు చేస్తున్నా..



ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, మిరప పంట సాగు చేసి పంట సాగు చేశాను. పంట చేతికి రాక రూ.2 లక్షలు నష్టపోయాయి. అయితే ఇప్పుడు ఎకరం పొలంలో వరినాట్లు వేస్తున్నాను. ఇందుకు దాదాపు రూ.40 వేల వరకూ ఖర్చు వస్తోంది. అప్పు చేసి మరీ పంట సాగు వేశాను. కష్టాల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకరంగా పెట్టుబడి సాయం అందిస్తే మరింత వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరుగుతుందని ఆశిస్తున్నాను.

– రాజప్ప, రైతు శ్రీరంగరాజుపల్లి, పరిగి

పంట వస్తుందని ఆశ



రెండేళ్లుగా మా పొలంలో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుత రబీ సీజన్‌లో నాలుగెకరాల్లో వరి నాట్లు సాగు చేశాను. క్రితం ఏడాది రెండెకరాల్లో మాత్రమే చేశాను. అప్పట్లో మంచి దిగుబడి వచ్చింది. పరిగి చెరువు నిండటం వల్లే మా పొలాలన్నింటికీ నీరు సమృద్ధిగా అందుతున్నాయి. పెన్నానదిలో ఫిల్టర్ బోర్ల వల్ల చాలా మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారు. ఇంటి అవసరాలతో పాటూ మా పిల్లల చదువులకు వరి పంట లాభాదాయకంగా నిలుస్తుందన్న ఆశతో సాగు చేస్తున్నాను.

– ఆది, రైతు, పైడేటి, పరిగి మండలం

వరి సాగు విస్తీర్ణం పెరిగింది



గతంలో కంటే ఈసారి రబీలో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాలతో చెరువులు నిండటంతో పాటు నదుల్లో నీటి ప్రవాహం ఉండటంతో పరివాహక ప్రాంతాలలో భూగర్భ జలాలు పెరిగాయి. దాదాపుగా సాగు నీటి బోర్లన్నీ రీచార్జ్ అయ్యాయి. దీంతో భూమి తనువు కోసం వరి సాగుపై రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. వరి సాగుకు అవసరమైన సలహాలను, వాడాల్సిన ఎరువుల, చీడపీడల నివారణపై పొలంబడి కార్యక్రమాల ద్వారా రైతులకు సూచనలతో అవగాహన కల్పిస్తున్నాం.

– విజయభారతి, వ్యవసాయాధికారి, పరిగి మండలం

'ఫీజు పోరు'ను విజయవంతం చేద్దాం



ఫీజు పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగాన్ని నాశనం చేశారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఫిబ్రవరి 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఫీజు పోరు పోస్టర్లను ఆయన శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఆవిష్కరించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్ చేసి విద్యార్థులను ఆదుకోవాలన్న డిమాండ్‌తో ఫీజుపోరు పేరుతో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ర్యాలీకి విద్యార్థులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు దాదాపు రూ.3,900 కోట్లను ఫీజురీయింబర్స్‌మెంట్ చేయకుండా సీఎం చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యార్థులకు సకాలంలో ఫీజులు చెల్లించడంతో పాటు అమ్మఒడిని పక్కాగా అమలు చేశారన్నారు. ఎన్నో సంస్కరణలతో విద్యారంగాన్ని పటిష్టం చేస్తే నేడు సీఎం చంద్రబాబు భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, గుడిబండ మండల కన్వీనర్ యంజారేగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంజునాథ్, నాయకులు సత్యనారాయణయాదవ్, మల్లికార్జున, శ్రీరామప్ప, వేమారెడ్డి, అంజలి, బాలకృష్ణారెడ్డి, కరియన్న తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మడకశిర: మడకశిర ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోరుబాగల్ సర్పంచు తిప్పేస్వామి సతీమణి విమలను శుక్రవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు పరామర్శించారు. ప్రమాదవశాత్తూ కింద పడటంతో ఆమెకు గాయాలు కావడంతో ఆమె ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పరామర్శించారు.

గ్రామ కమిటీలతోనే పార్టీ బలోపేతం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



నూతన కమిటీ సభ్యులతో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: గ్రామ కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో పార్టీ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర, బూత్ కన్వీనర్‌గా దొమ్మిరి ముత్యాలు, మహిళా అధ్యక్షురాలిగా నాగలత, యూత్ అధ్యక్షుడిగా దివాకర్, యూత్ ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, సోషల్ మీడియాకు ఉపేంద్ర, బీసీ సెల్‌కు బి.సనపయ్య, ఎస్సీ సెల్‌కు శ్రీనివాసులు, మైనార్టీ సెల్‌కు బావయ్య, రైతు సంఘం అధ్యక్షుడిగా మల్లప్ప గారి నాగరాజు తదితరులతో కమిటీ ఏర్పాటు చేశారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

గోనిమేకులపల్లిలో ఇటీవల వివిధ కారణాలదో మృతి చెందిన నాలుగు పేద కుటుంబాలను మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, వినయ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తీర్థ, జయప్ప, నగేష్, మాధవ, శివయ్య, చిరంజీవి, మాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల మీట్



ఎంపీడీఓతో మాట్లాడుతున్న సర్పంచ్ ముద్దరాజు

అగళి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఎంపీపీ రేణుక అధ్యక్షన నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు సగానికిపైగా అధికారులు గైర్హాజరయ్యారు. ఎంపీటీసీలు వచ్చినా నామమాత్రంగా సంతకం చేసి వెళ్లిపోయారు. ఉన్నవారితోనే నామమాత్రంగానే సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచులకు, కో ఆప్షన్ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సభ ఎలా నిర్వహిస్తారని సర్పంచ్ ముద్దరాజు... ఎంపీడీఓ యాదవేంద్రను ప్రశ్నించారు. వాట్సాప్ గ్రూపులో పెట్టాము చూసుకోవాలని ఎంపీడీఓ సమాధానం ఇవ్వడంతో.. ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని సర్పంచు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో విద్యుత్ సమస్యలు ఎక్కువయ్యాయని సంబంధిత అధికారులు సమావేశానికి రాకపోతే ఎలా అని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ఉమేశ్, వైస్ ఎంపీపీ విమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



విద్యార్థిని బహుమతు అందజేస్తున్న ఉదయ్‌నాయుడు

హిందూపురం టౌన్: విద్యార్థి, యువత ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా రవాణాశాఖ కార్యాలయం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

నూతన బస్సుల ప్రారంభం



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి

పెనుకొండ రూరల్: పెనుకొండ డిపో నుంచి హైదరాబాద్‌కు ఏపీఎస్‌ఆర్టీసీ నూతన బస్సు సర్వీసులను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. గోరంట్ల నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్ వరకూ రెండు సూపర్ లగ్జరీ బస్సులు, పెనుకొండ నుంచి హిందూపురం, అనంతపురానికి మరో ఎక్స్‌ప్రెస్ బస్సును స్టార్ట్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పరిగి: మండలంలోని పెన్నా, జయమంగళీ నదీ పరివాహక ప్రాంతాల్లో శుక్రవారం మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. బోరెడ్డిపల్లి, శాసనకోట ప్రాంతాల్లోని నదుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసి తహసీల్దారుకు అప్పగించామన్నారు.

'సంక్షిప్త సమాచారం

నేడు కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం గ్రామంలో కంది, రాగుల కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభిస్తున్నట్లు స్థానిక సొసైటీ సీఈఓ సురేష్ తెలిపారు. అదే విధంగా నాబార్డ్ నిధులతో నిర్మించిన గోదామును కూడా ప్రారంభిస్తారన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

హిందూపురం: హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్య కార్మికులకు వేతనాలు రూ.26 వేలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము డిమాండ్ చేశారు. శుక్రవారం పారిశుధ్య కార్మికులతో సమావేశంలో నిర్వహించారు. 16 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుడిబండ: మండల పరిధిలోని కేకాతి గ్రామానికి చెందిన ముద్దలింగప్ప (65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రఘువీర ఆ గ్రామానికి వెళ్లి ముద్దలింగప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా లక్ష్మీనరసింహ

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా లక్ష్మీ నరసింహ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తామన్నారు.

పిల్లలు బడుల్లోనే ఉండాలి

హిందూపురం అర్బన్: బడి ఈడు పిల్లలు అందరూ బడుల్లోనే ఉండాలని మాజీ ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికా సదనంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సుదర్శన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అడవికి నిప్పు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారి పులేకమ్మ దేవాలయం సమీపంలోని అటవీ ప్రాంతానికి దుండగులు నిప్పు పెట్టారు. దీంతో వేగంగా మంటలు వ్యాపించాయి. అటవీశాఖ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు.

వాసవీ మాతా నమోస్తుతే !

మడకశిర/అగళి/రొళ్ల/అమరాపురం: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం మండల కేంద్రాల్లోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వ్రతాలు, అభిషేకాలు, పూజలు జరిపారు.



రొళ్ల: వాసవీమాతకు 108 రకాల పిండి పదార్థాలను సమర్పించిన దృశ్యం


పౌర హక్కులపై అవగాహన

గోరంట్ల: మండల పరిధిలోని నార్సింపల్లి ఎస్సీ కాలనీలో తహసీల్దార్ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అయితే ఇటీవల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెయ్యాల వెంకటశివారెడ్డికి ఏ సంబంధం లేకపోయినా అతనిపై ఎస్సీ, ఎస్టీ కేసు ఎందుకు పెట్టారని స్థానికులు సీఐ బోయ శేఖర్‌ను ప్రశ్నించారు. అది తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించామని సీఐ బదులిచ్చారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, మహిళా సంరణ కార్యదర్శి సుశీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

లేపాక్షి: ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండి హక్కులను కాపాడుకోవాలని ఏఎస్ఐ షర్ఫుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రమైన లేపాక్షి ఎస్సీ కాలనీలోని ముత్యాలమ్మ దేవాలయంలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రమీల, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని హెచ్ డీ హళ్లి గ్రామంలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ వీరేష్ వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్ఓ లావణ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



నారాయణ జూనియర్ కళాశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: అనంతపురంలోని నారాయణ బాయ్స్ హాస్టల్ క్యాంపస్‌లో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న టీ.చరణ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చేపట్టిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి, కదిరీష్, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్, యువనాయకులు మనోజ్ కుమార్ మాట్లాడారు. చరణ్ మృతిపై సమగ్రమైన విచారణ చేయాలని, నారాయణ కళాశాలను సీజ్ చేయాలని, నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు.

పరిగి: మండలంలో శుక్రవారం విద్యార్థి సంఘాలు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థులను అనేక విధాలుగా ఇబ్బందులు పెడుతున్న నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేసి, కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు.